ఎరువులు, విత్తనాల కొరత లేదు

- కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు
- డిమాండ్ కారణంగా రెండు ప్యాకెట్లే ఇస్తున్నాం
- దుష్ప్రచారం చేస్తే ఉపేక్షించం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కొరత లేదని, అయితే కొన్ని రకాల పత్తి విత్తనాలకు మాత్రమే అధిక డిమాండ్ ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎక్కువ డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను అందరికీ అందించాలన్న ఉద్దేశంతోనే ఒక్కొక్కరికి రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పత్తి విత్తనాల కొరత ఉన్నదంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ఎరువులు, విత్తనాల కొరత అంటూ తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతులను క్యూలో నిలబెట్టే సందర్భంలో లాఠీచార్జి జరిగిందంటూ ప్రతిపక్షాలు ప్రచారం చేయడం రైతుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ఇప్పటివరకు వివిధ కంపెనీలకు చెందిన 51,40,405 పత్తి విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచగా, 10,39,040 ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేశారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చెప్తున్నట్టుగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అన్ని రకాల హైబ్రీడ్ విత్తనాలకు ఒకేరకంగా దిగుబడి వస్తుందని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ఎరువుల, పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

ఈ సీజన్‌లో 109.15 కోట్ల సబ్సిడీతో 1.95 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు. ఇప్పటివరకు 79,261 క్వింటాళ్లు పంపిణీ చేశామని, అందులో 54,162 క్వింటాళ్లు రైతులు కొనుగోలు చేశారని చెప్పారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే 29,000 క్వింటాళ్లు ఇప్పటికే అధికంగా రైతులకు అందించామని పేర్కొన్నారు. ఎరువులకు సంబంధించి కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకున్నదని తెలిపారు. ప్రస్తుతం యూరియా 6.88 లక్షల టన్నులు, డీఏపీ 79 వేల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4.21 లక్షల టన్నులతోపాటు ఇతర రకాలు కలిపి మొత్తం 12.28 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా.. లేనట్టా?

- వ్యవసాయ మంత్రి ఎక్కడ?.. ముందుచూపులేని సీఎం ఎక్కడ?
- అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టొద్దు: కేటీఆర్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా? విత్తనాల కోసం రైతులకు ఏమిటీ వెతలు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. వ్యవసాయశాఖను పర్యవేక్షించాల్సిన ఆ శాఖ మంత్రి ఎక్కడ?, ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేది? అని నిలదీశారు. 'ఎన్నికల ప్రచారంలో తిరగటం తప్ప, ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్కలేదా? నిన్న ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు. నేడు విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు. పాలన పూర్తిగా పడకేసిందని చెప్పటానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి?' అని బుధవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. సాగునీళ్లు ఇవ్వటం చేతకాక పంటలు ఎండగొట్టారని, ఇప్పుడు విత్తనాలు అందించే విజన్ కూడా లేదా? తెల్లవారుజామున 4 గంటలకు లైన్‌లో నిలబడితే సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పదేండ్లపాటు 10 నిమిషాల్లో అందిన విత్తనాలను.. 10 గంటలపాటు పడిగాపులు పడినా అందించలేరా? అని నిలదీశారు. రంగారెడ్డి నుంచి కామారెడ్డి దాకా రైతులకు ఏమిటీ కష్టాలు? ఇంకెన్ని రోజులు ఈ కన్నీళ్లు? దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ, అన్నదాతకే తిండితిప్పలు లేకుండా చేస్తారా? బీఆర్ఎస్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయాన్ని అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఆగం చేస్తారా? అని వరుస ప్రశ్నలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా సరిపడా విత్తనాల స్టాక్ తెప్పించాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కళ్లెం వేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టవద్దని, రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదని హెచ్చరించారు.

విత్తనాలడిగితే లాఠీచార్జినా?

- కేసీఆర్ పాలనలో ఎన్నడూ కొరత లేదు
- 'కాళేశ్వరం' ప్రాజెక్టు ప్రాధాన్యత రేవంత్‌కు ఇప్పటికైనా తెలిసింది
- అందుకే మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీరు
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పాట్లు పట్టడం లేదని, విత్తనాల కోసం వచ్చిన రైతులపై లాఠీచార్జి చేయడం దారుణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో విత్తనాలు, ఎరువులకు ఎన్నడూ కొరత రాలేదని, నీళ్లందక పంటలు ఎండలేదని, కరెంటు కోతలు లేవని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులు బారులు తీరి నిలబడాల్సిన అగత్యం కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైందని, కరెంటు, సాగునీళ్లు ఇవ్వకుండా, పంటలు కొనకుండా, బోనస్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా మారిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడంలో తన కున్న పేరును మరోసారి కాంగ్రెస్ నిలబెట్టుకుంటోందని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే ప్రగతి భవన్ ముందు వేసిన కంచెను ఇప్పుడు తొలగించి రాక్షసానందం పొందారని, లక్షలాదిగా వచ్చిన ప్రజల దరఖాస్తులకు పరిష్కారాలు ఏవని ప్రశ్నించారు. ప్రజాభవన్ లో ఒక్క రోజు దరఖాస్తులు స్వీకరించి ఆరు నెలలుగా ముఖం చాటేశారని దుయ్యబట్టారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, గొర్రెల పథకాలన్నీ ఫెయిల్ అని ప్రచారం చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అన్న రేవంత్‌రెడ్డి, అదే ప్రాజెక్టు పరిధిలోని మల్లన్నసాగర్ నుంచి మూసీ, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌కు నీళ్లు తెచ్చేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని గుర్తుచేశారు. సీఎంకు ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాధాన్యత తెలిసివచ్చిందన్నారు.

మెదక్ జిల్లా తూప్రాన్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

రాష్ట్రంలో విత్తన విపత్తు

మొదటిపేజీ తరువాయి...

మరో 150 మంది ఉత్తచేతులతోనే ఇంటికి వెళ్లారు. ఉదయం నుంచి పడిగాపులుకాసినా బస్తా దొరకకపోవడంతో రైతులు అధికారులను నిలదీశారు. రెండు రోజుల్లో విత్తనాలు ఇస్తామని వ్యవసాయ అధికారి రాగమ్మ రైతులను సముదాయించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి వచ్చి రైతులకు సరిపడా విత్తనాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో జీలుగ విత్తనాల కోసం లైన్‌లో గంటల తరబడి నిలబడలేక రైతులు రోడ్డెక్కారు. తూప్రాన్‌లోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం ఎదురుగా రాస్తారోకో నిర్వహించి, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో రైతులు పాస్‌బుక్ జిరాక్స్‌లను వరుసలో ఉంచారు. మొత్తం 7వేల మందికిపైగా రైతులకు విత్తనాలు అందించాల్సి ఉండగా, 987 బస్తాల జీలుగు, 300 బస్తాల జనుము విత్తనాలు మాత్రమే పంపిణీ చేశారు. తెల్లవారుజామునే వచ్చి లైన్‌లో ఉన్నామని, పొద్దంతా ఎండలో పడిగాపులు కాసినా తమకు విత్తనాలు దొరకలేదని రైతులు వాపోయారు. కరీంనగర్ జిల్లాలో 7వేల క్వింటాళ్ల జీలుగ, 200క్వింటాళ్ల జనుము అవసరం ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారులు ఇండెంట్ ఇచ్చారు. ఇప్పటివరకు 2,500 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల జనుము విత్తనాలు మాత్రమే జిల్లాకు చేరుకున్నాయి. బుధవారం సుమారు 2,500క్వింటాళ్ల జీలుగ విత్తనాలను జిల్లాలోని 62 కేంద్రాల్లో పంపిణీ చేయగా, రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలో సుమారు 40 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను పంపిణీ చేయగా, రెండుమూడు గంటల్లోనే ఖాళీ అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాల కోసం రెండోరోజూ రైతులు దుకాణాల వద్ద బారులుదీరారు. ఒక్కో రైతుకు ఆర్‌సీహెచ్ 659 విత్తనాలను రెండు ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేశారు. మండుటెండలోనూ రైతులు భారీగా తరలి రావడంతో ఆదిలాబాద్ మార్కెట్ ఏరియా రద్దీగా మారింది. విత్తనాల అమ్మకాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పర్యవేక్షించారు.

కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లోని పీఏసీఎస్ ఎదుట పాస్‌పుస్తకాలు వరుసలో పెట్టి ఎండలో విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి రైతు వేదిక వద్ద విత్తనాల కోసం టోకెన్లు తీసుకునేందుకు ఉదయం 7 గంటలకే చేరుకొని చెప్పలను క్యూలో ఉంచిన రైతులు

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?

రైతులను ఇబ్బంది పెట్టడమే ఇందిరమ్మ రాజ్యమా? వానకాలం సీజన్ ప్రారంభమైనా జీలుగు, జనుము, విత్తనాలు ఇంకెప్పుడు ఇస్తరు? అధికార యంత్రాంగం సాగుకు అవసరమైన అంచనా వేసి ఫర్టిలైజర్, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలి. నకిలీ విత్తనాలతో అన్నదాతలు నష్టపోతున్నరు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- ఊరడి శివారెడ్డి, గోపాల్‌పూర్, కరీంనగర్

లోకం పోకడ



'మార్పు' గిట్ల వుంటదను కోలే!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	44.8°c	31.1°c
ఆదిలాబాద్	44.8°c	25.6°c
ఖమ్మం	44.0°c	29.0°c
మెదక్	43.0°c	26.5°c
రంగారెడ్డి	42.5°c	25.2°c
కరీంనగర్	42.0°c	32.0°c
హైదరాబాద్	40.2°c	27.3°c
నిజామాబాద్	40.1°c	29.7°c
మహబూబ్‌నగర్	39.9°c	29.4°c
వరంగల్	39.0°c	30.0°c

24 గంటల్లో కేరళకు నైరుతి

- భారత వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): మరో 24 గంటల్లో కేరళకు నైరుతి రుతుపవనాలు రానున్నట్టు భారత వాతావరణశాఖ బుధవారం వెల్లడించింది. రుతుపవనాలు ముందే వస్తున్నా కేరళ ఇప్పటికే భారీ వర్షాలు, తాగునీటి ఎద్దడితో అల్లాడిపోతుంది. కొట్టాయం, ఎర్నాకులం జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరో మూడు జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. కర్ణాటక, ఏపీ, అస్సాంలోని కొన్ని ప్రాంతాలకు జూన్ 5 నాటికి, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ ఎగువభాగం, పశ్చిమబెంగాల్‌కు జూన్ 10న చేరుకుంటాయని ఐఎండీ తెలిపింది. గురువారం నుంచి వర్షాకాలం ప్రారంభమైనట్టేనని పేర్కొన్నది. రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో పొడివాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శుక్రవారం మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. రాగల రెండు రోజులు పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.

రాష్ట్రంలో కొత్తగా 27 రకాల బీర్లు

మొదటిపేజీ తరువాయి...

బీర్లను తయారు చేస్తున్నది. ఇదే కంపెనీ ఏపీలో 'ట్రెడిషనల్ ఎక్సలెన్స్ ఇన్ క్వాలిటీ' అనే కంపెనీ పేరుతో బీర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నది. అలాగే చెన్నైలో 'సెయింట్ పాట్రిక్స్' పేరుతో మద్యం బీర్లు తయారు చేస్తున్నది. దీని రిజిస్టర్ స్టేట్ మాత్రం మధ్యప్రదేశ్. 'అమెరికన్ బ్రూవ్ క్రాఫ్ట్ లిమిటెడ్ (ప్రై)'తో ఇది టైఅప్ అయినట్లుగా సమాచారం. 'బ్లాక్ బస్టర్' పేరుతో నాలుగు ఫ్లేవర్లలో బీర్లను ఈ సంస్థ తయారు చేస్తున్నది. కాగా తెలంగాణలో మాత్రం రెండు బ్రాండ్లను మాత్రమే అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నది. అలాగే ఎక్సోటికా లిక్కర్ ప్రై. లి. కంపెనీ కూడా సంగారెడ్డి జిల్లా మల్లేపల్లిలో బీర్లను తయారు చేస్తున్నట్లు దరఖాస్తు చేసుంది. అయితే.. రాష్ట్రంలో ఉన్న బీర్ల కొరతను తగ్గించేందుకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న సంస్థలకు అనుమతులు ఇచ్చామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ పేర్కొన్నది.

విత్తనాలు అందేలా చర్యలు తీసుకోండి

- కలెక్టర్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ లేఖ

హైదరాబాద్, మే 29(నమస్తే తెలంగాణ): అన్ని జిల్లాల్లో అవసరమైన పత్తి, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ జిల్లా కలెక్టర్లను కోరారు. ఏయే జిల్లాలో ఏ విత్తనాలు ఎంత స్టాక్ ఉన్నాయో తెలియజేస్తూ కలెక్టర్లకు బుధవారం లేఖ రాశారు. ఈ సీజన్ కోసం 1.41 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను, 1.26 కోట్ల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. విత్తనాల కొరత లేదని, అందుబాటులో ఉన్న స్టాక్‌ను డీఏవోలు, ఇతర అధికారుల సాయంతో రైతులకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- ఉద్యాన శాఖ ఈ ఏడాది ప్రణాళిక
- 18 వేల మంది రైతుల రిజిస్ట్రేషన్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది (2024-25) కొత్తగా లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఉద్యానశాఖ డైరెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 67,500 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు 18 వేల మంది రైతులు తమ పేర్లను నమోదు చేయించుకున్నారని చెప్పారు. వర్షాలు ప్రారంభంకాగానే రైతులకు మొక్కలను అందజేస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై బుధవారం జిల్లా అధికారులతో ఆన్‌లైన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉండాలని, ఆయిల్‌పామ్ సాగుపై ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం 2.03 లక్షల ఎకరాలకు చేరుకున్నదని, ఇందులో 1.56 లక్షల ఎకరాలు 2021-22 నుంచే సాగవుతున్నదని వివరించారు. ఈ ఏడాది కూడా లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని, అవసరమైన మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

'సోం' చీకటి కథ!

పాపాల పుట్టగా మధ్యప్రదేశ్ లిక్కర్ కంపెనీ 'సోం డిస్టిలరీస్'

1980 నుంచే అక్రమాలకు తెరతీసిన మద్యం కంపెనీ

- అధికారంలో ఉండే పార్టీతో అంటకాగే సోం అధిపతి అరోరా
- రాష్ట్రాల్లో మద్యం పాలసీ ఎలా ఉండాలో నిర్ణయించేదీ అతనే
- ఎంపీ సీఎంగా దిగ్విజయ్ ఉన్నప్పుడు పాలసీ డిజైనింగ్ అరోరాదే?
- సొంత స్పిరిట్ తయారీ పోర్ట్‌ఫోలియోతో 'సోం'లో కల్తీ మద్యం?!
- 2021లో ఎంపీలో 24 మందిని పొట్టనబెట్టుకొన్నట్టు వార్తలు
- కంపెనీపై పన్ను ఎగవేత ఆరోపణలు.. రాయిటర్స్‌లోనూ కథనాలు
- ఇలాంటి చరిత్ర ఉన్న సంస్థకు.. తెలంగాణ సర్కారు గ్రీన్ సిగ్నల్

'రాష్ట్రంలోకి కొత్త లిక్కర్ బ్రాండ్ల'ను తెస్తున్రటగా అన్నా..
అవును. తమ్మీ.. 'సోం' అనే కంపెనీకి రేవంత్ సర్కారు అనుమతి ఇచ్చిందట.
ఆ కంపెనీలో పూర్తిగా కల్తీ మద్యమే తయారవుతదటగదనే..
గదే అంటున్రు.. అది తాగే మధ్యప్రదేశ్‌లో కొందరు చనిపోయిన్రట కదా
పన్ను ఎగవేత, అవినీతి తదితర ఆరోపణలు గిట్ల ఉన్నయట కూడా..
మరి గట్లాంటి కంపెనీకి మన తెలంగాణ రాష్ట్రంలో పర్మిషన్ ఎట్ల ఇస్తరే?!!

రాష్ట్రంలోకి కొత్త మద్యం బ్రాండ్ 'సోం'కు అనుమతులనిచ్చినట్టు వార్తలు వెలువడినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ. అసలేమిటీ కంపెనీ? నడిపిస్తున్నదెవరు? నిజంగా ఈ కంపెనీని వివాదాలు చుట్టుముట్టాయా??

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

భోపాల్, మే 28 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌కు చెందిన సోం డిస్టిలరీస్ కంపెనీ దేశంలో వివాదాస్పద మద్యం తయారీ కంపెనీల్లో ఒకటని పారిశ్రామిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కంపెనీ వ్యవస్థాపకుడైన జగదీశ్‌కుమార్ అరోరా (జేకే అరోరా) తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి, ఇదే సమయంలో కంపెనీ మూలాలను రక్షించుకోడానికి ప్రధాన పార్టీల నేతలందరితో సఖ్యతతో ఉంటారని పేర్కొంటున్నారు. అవసరమైనప్పుడు రాజకీయ పార్టీలకు పెద్దయెత్తున ముడుపులను సమర్పించుకొంటారని సమాచారం.

ప్రారంభంతోనే వివాదాలు

1980లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జేకే అరోరా ఓ చిన్న మద్యం వ్యాపారిగా జీవితాన్ని ప్రారంభించారు. సన్నిహితుల ద్వారా అప్పటి జనతా పార్టీ కీలక నేతలకు దగ్గరయ్యారు. అప్పటికే కేడియా ఫ్యామిలీ ఆఫ్ కంపెనీస్ మధ్యప్రదేశ్ మద్యం వ్యాపారంలో తిరుగులేనిదిగా చక్రం తిప్పుతున్నది. 1980వ దశకం చివర్లో బీజేపీ నుంచి సుందర్‌లాల్ పట్వా సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికే ఆయనతో సాన్నిహిత్యం ఉన్న అరోరా.. ప్రభుత్వ అండదండలతో భోపాల్‌లో లిక్కర్ దుకాణాలను తెరిచారు. సోం గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ పేరిట మద్యాన్ని రిటైలర్లకు సరఫరా చేసేవారు. 1993లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా సీఎంగా దిగ్విజయ్ సింగ్ బాధ్యతలు చేపట్టారు. ఆరోరాకు దిగ్విజయ్‌తోనూ సాన్నిహిత్యం ఉండటంతో లిక్కర్ పాలసీ విధివిధానాలను అరోరానే రూపొందించినట్టు చెప్తారు. మధ్యప్రదేశ్‌వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో తన బ్రాండ్ బీర్లు, విస్కీ, రమ్ము మాత్రమే విక్రయించేలా నిబంధనలు తీసుకొచ్చినట్టు వార్తలు వచ్చాయి. దీనిపై పెద్దయెత్తున విమర్శలు వ్యక్తంకాగా, ప్రభుత్వ పెద్దల విజ్ఞప్తితో అరోరా కొంత వెనక్కి తగ్గారు.

అమాయకులతో మృత్యుకేళి

రాజకీయ నేతల అండదండలతో బీజేపీ, కాంగ్రెస్‌పాలిత 23 రాష్ట్రాలు, యూటీల్లో 'సోం కంపెనీ మద్యం' ఏరులై పారే స్థాయికి చేరుకొన్నది. భోపాల్‌లో సోం కంపెనీ ఏర్పాటుచేసిన దేశంలోనే తొలి స్పిరిట్ పోర్ట్‌ఫోలియోలో మద్యం నాణ్యతా ప్రమాణాలు గాలిలో కలిసిపోయాయి. డబ్బులకు ఆశపడి కల్తీ మద్యాన్ని ఈ ప్లాంట్లలో తయారు చేయడంతో 2021లో మధ్యప్రదేశ్‌లో 24 మంది మృత్యువాత పడ్డట్టు జాతీయ హిందీ పత్రిక 'దైనిక్ భాస్కర్' ఓ కథనంలో వెల్లడించింది. దీని ఫలితంగానే ప్లాంట్‌ను సీజ్ చేసినట్టు వివరించింది. గుజరాత్‌లోనూ ఈ మద్యాన్ని తాగి మరికొందరు మరణించినట్టు ఆరోపణలున్నాయి. 'సోం' మద్యం నాణ్యత విషయంలో ఫిర్యాదులు అందడంతో ఇటీవలే మధ్యప్రదేశ్ సర్కారు ఆ కంపెనీకి నోటీసులను ఇచ్చింది. ఇక పన్ను ఎగవేత ఆరోపణలు కూడా 'సోం' కంపెనీకి కొత్తకాదు. స్థానిక పత్రికల నుంచి రాయిటర్స్ వంటి అంతర్జాతీయ పత్రికలవరకూ ఈ ఎగవేత, అక్రమాలకు సంబంధించిన కథనాలు పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)' 2021లో సోం డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్‌పై దాడులు జరిపింది. ధరల నిర్ధారణ, సిండికేట్ తదితర వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీసీఐ అధికారులు సోం డిస్టిలరీస్ సంస్థపై దాడులు చేశారు.

లోపాయికారి చెల్లింపులు

సీఎం నుంచి స్థానిక కౌన్సిలర్ వరకూ అందరితో మంచిగా ఉండేందుకు గుట్టుచప్పుడు కాకుండా ముడుపులను లక్షిత పార్టీకి, నేతలకు చేరవేయడంలో 'సోం' నిర్వాహకులది అందెవేసిన చెయ్యిగా చెప్తారు. పార్టీల ఎన్నికల ప్రచారానికి స్పాన్సర్‌షిప్, నేతలకు గిఫ్ట్‌ల రూపంలో ఇండ్లు, బంగారం, భూములను ఎవరికీ తెలియకుండా చేరవేయడం 'సోం' స్పెషాలిటీ. అంతేకాదు.. బీజేపీ, కాంగ్రెస్‌కు ఎన్నికల ఫండింగ్‌లోనూ ఈ సంస్థ కీలకంగా వ్యవహరించినట్టు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బట్టి అర్థమవుతున్నది.

'సోం' బీర్ కమీషన్లపై విచారణ జరిపించాలి

- ఆ డిస్టిలరీ కంపెనీ కాంగ్రెస్‌కు విరాళం ఇవ్వలేదా?
- మంత్రి జూపల్లి ఎందుకు స్పందించడం లేదు?
- నకిలీ మద్యం కంపెనీల అనుమతులు రద్దు చేయాలి
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ డిమాండ్



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): వివాదాస్పదమైన సోం డిస్టిలరీ సంస్థ కమీషన్లపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఆ సంస్థ నుంచి కాంగ్రెస్ పార్టీ విరాళాలు తీసుకోవడంపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ 'సోం' డిస్టిలరీ నుంచి మూడుసార్లు రూ. 25 లక్షల చొప్పున తీసుకున్నదని చెప్పారు. ఒకసారి ఏకంగా రూ.1.31 కోట్లు సోం డిస్టిలరీ నుంచి కాంగ్రెస్‌కు ముడుపులు అందాయనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నకిలీ మద్యం సంస్థ అయిన 'సోం' డిస్టిలరీకి వకాల్తా పుచ్చుకొని మంత్రి తన లేఖలో ఆ సంస్థ గొప్పతనాన్ని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. వారం ముందే ఇలాంటి వ్యాపారాలు తెలంగాణ రాష్ట్రంలో వస్తలేవని చెప్పి, వారం తిరగకముందే బీఆర్ఎస్ బయటపెట్టిన అనంతరం ఆ కంపెనీ గురించి గొప్పలు ఎలా చెప్తారని నిలదీశారు. 'సోం' డిస్టిలరీకి వ్యాపారం కట్టబెట్టారంటేనే కాంగ్రెస్‌కు కమీషన్ ముట్టినట్టు తెలుస్తున్నదని ఆరోపించారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, అప్పటివరకు 'సోం' డిస్టిలరీ సంస్థకు తెలంగాణలో మద్యం అమ్మే అనుమతులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లిని క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని లేని పక్షంలో ఈ డీల్ కుదరడంలో సీఎం రేవంత్ పాత్ర కూడా ఉన్నదని భావించవలసి వస్తుందని చెప్పారు.

వాస్తవాలు రాస్తే పరువునష్టమా?

ఈ నెల 21న గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టిన మంత్రి జూపల్లి .. తెలంగాణలో కొత్తగా వ్యాపారం చేయడానికి మద్యం కంపెనీలు కొత్త ప్రతిపాదనలు పెట్టలేదని చెప్పారని క్రిశాంక్ గుర్తుచేశారు. అలా ప్రచారం చేసే మీడియాపై రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని బెదిరించారని తెలిపారు. తాను ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో జూపల్లి అబద్ధాన్ని బహిర్గతం చేస్తూ సోం డిస్టిలరీస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతివ్వడంపై మీడియా సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. దానికి జవాబుగా మంత్రి జూపల్లి ఈ నెల 28న ప్రకటన విడుదల చేసి.. 'సోం' డిస్టిలరీస్‌కు అనుమతులివ్వడం వాస్తవమేనని ఒప్పుకున్నారని చెప్పారు. నకిలీ మద్యం అమ్మే సంస్థ తెలంగాణలో వ్యాపారం మొదలు పెడుతుంటే.. సమాచారం లేదని మంత్రి అనడం బాధ్యతారహితం అని ఎద్దేవా చేశారు. 'సోం' డిస్టిలరీస్‌కు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ వారే అనుమతులు ఇచ్చారనడం హాస్యాస్పదమన్నారు. నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేపై కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆయన సొంతూరు వాసులు

జడ్చర్ల ఎమ్మెల్యేపై ఫిర్యాదు

- అనుమతి లేకుండా మట్టి తరలింపు
- గుర్రాలపై స్వారీకి 15 వేల ట్రాక్టర్ల మొరం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సొంతూరు వాసులు

రాజాపూర్, మే 29 : అక్రమంగా మట్టి తరలింపుపై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనురుధ్‌రెడ్డిపై ఆయన సొంతూరు వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామ శివారులో 361, 362 సర్వే నంబర్లలో ఇష్టానుసారం మట్టిని తవ్వి తరలిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన గుర్రాలపై స్వారీ చేయడానికి గ్రామ సమీపంలో ఉన్న సర్వే నంబర్లు 87, 89, 90, 91లోని భూముల్లో నుంచి గుర్రాల కోసం 15 వేల ట్రిప్పుల ట్రాక్టర్ల మొరాన్ని 3 మీటర్ల ఎత్తులో నింపినట్టు రంగారెడ్డిగూడ వాసులు తెలిపారు. ఈ విషయమై బుధవారం వారు కలెక్టర్ రవినాయక్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మట్టిని అక్రమంగా తరలించిన ఎమ్మెల్యేపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరినట్టు గ్రామస్థులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, శ్రీను తెలిపారు.